# అమ్మకానికో వస్తువు

సంగీత పాత సినిమా ఆనందంగా చూస్తోంది. సినిమాలో కథ తెలిసిందే - పాత్రల పేర్లు పరిచయమైనవే - సంఘటనలన్నీ ఎరుగున్నవే - పాటలన్నీ ఎప్పుడూ వింటూ వుండేవే, ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సినిమా ఒకసారి చూసిన సినిమాయే - అయినా పాత సినిమా అనే వ్యామోహంతో చూస్తోంది సంగీత.

అమ్మాయిని బజారులో పెట్టి, ఆమె అందచందాలు పొగుడుతూ, వాటికి విలువ కడుతూ, వేలంపాట సాగుతోంది. ఆమె మాత్రం ఒక్కసారిగా తన అందమైన కంఠమెత్తి 'ఆజా... అబ్ తో ఆజా - మేరి కిస్మత్ కి ఖరీదార్ అబ్ తో ఆజా' అంటూ పాట మొదలుపెట్టింది. మధ్యమధ్యలో ఆమెకోసం అతివేగంగా గుర్రం మీద ఆమె ప్రియుడు వస్తూ కనిపిస్తున్నాడు.

ఎప్పుడో అనాగరికమైన కాలంలో ఇలా ఆడపిల్లల్ని బలిపశువుల మాదిరిగా, బజారులో పెట్టి, వేలం పాటలో అమ్ముతుండేవారు. అదీ మనదేశంలో లేదని మనవాళ్ళు గొప్పగా చెప్తూ వుంటారు. అందులో నిజమెంతో మనకీ తెలీదు.

ఆ అమ్మకంలో అమ్మాయి అందానికీ, ఆటపాటలకీ, విలాసాలకీ ఎంత ఖరీదు పలుకుతుందో చెప్పడం కష్టం. అక్కడ ఆమె మనసుకీ, ఆమె యిష్టానికీ, అయిష్టానికీ, ఆమె భద్రతకీ, బ్రతుక్కీ అస్సలు విలువేలేదు.

అవునన్నా, కాదన్నా, మొండికేసినా, మొరాయించినా వ్యాపారం సాగిపోతుంది. అమ్మకం జరిగిపోతుంది. ఆమె చేతులు మారిపోతుంది. దేశం సరిహద్దులు దాటిపోతుంది. లేకపోతే అక్కడే వారకాంతలా ఆమెకి బానిస బ్రతుకు ప్రారంభమవుతుంది. ఆమె మగవాడి

చేతిలో ఒక ఆట వస్తువుగా, అతని అవసరాలు తీర్చే భోగవస్తువుగా, నోరెత్తలేని మూగ జీవిగా మారిపోతుంది. ఆమెను కాపాడి, రక్షించే వారెవరూ వుండరు.

పవర్ కట్ అయింది. సినిమా ఆగిపోయింది. సంగీత బరువుగా ఊపిరి పీల్చుకుని వెనక్కి జారగిలపడింది. ఎదురుగా టేబులు మీద పడివున్న న్యూస్‌పేపరు తీసుకుని తిరగేయడం మొదలుపెట్టింది.

నేటి సమాజంలోని వాస్తవ చిత్రాలతో పేపరు భయంకరంగా వుంది. అలా పేపరు చూస్తున్నకొద్దీ సంగీత మనసు ఆవేదనతో, బాధతో గిజగిజలాడిపోవడం మొదలైంది.

మన పక్కనే, మనం చూస్తుండగానే, భయం లేకుండా, ఇంత బట్టబయలుగా ఇలాంటి ఘోర వ్యాపారం ఎలా సాగుతోంది? అత్యంత సహజంగా ఈ సమాజం దాన్నెలా స్వీకరిస్తోంది?

ఏలూరులో ఆడపిల్లల వేలం పాట ఈరోజు బయటపడి అందరూ గగ్గోలు పడుతున్నారుగానీ ఇలాంటివి జరుగుతున్నాయని ఇంతకాలం ఎవ్వరికీ నిజంగా తెలీదా? తెలిసినా అది తమకి సంబంధించిన విషయం కాదని నిర్లక్ష్యం చేశారా? మన సంస్కృతి గురించి గొప్పలు చెప్పేవారంతా, అందులో ఇదీ ఒక భాగమని ఒప్పుకోవడానికి భయపడ్డారా?

సంగీతకి తన చిన్నప్పటి సంఘటనొకటి చటుక్కున గుర్తుకొచ్చింది. ఆరోజు ఎదురింట్లో మాంచి హడావిడిగా వుంది. వచ్చే జనం పోయే జనం. తను అదేమిటో తెలుసుకోవాలనే వుత్సాహంతో "అమ్మా! ఏమిటే వాళ్ళింట్లో?" అంది.

అమ్మ విసుగ్గా "అన్నీ నీకే కావాలి, నోరు మూసుకుని పో" అంటూ కసురుకుంది. ఇంతలో బామ్మ సాధింపు ధోరణిలో అందుకుంది. "వాళ్ళు మనవాళ్ళు కాదు. అస్తమానూ అటు వెళ్ళకు" అని సాగదీసింది.

తనకు ఒళ్ళు మండింది. "నేను వెళ్ళి చూడగలను, చూస్తాను" అని తనలో తనే అనుకుంటూ పరుగుతీసింది.

"మూడు వేలివ్వండి"

"ఇంటిడి చాకిరీ చేస్తుంది"

"పిల్ల చిర్రని చీది ఎరుగదు"

"మీరెట్లా వాడుకున్నా..." ఈ కంఠం మరీ నెమ్మదిగా వుంది. రాజీకి కొత్తబట్టలు కట్టారు. తలలో పూలు పెట్టారు.

"మళ్ళీ పిల్ల గురించి వాకబులూ అవీ అంటే బాగుండదు"

"ఆ భయం మీకక్కరలేదు, మీకిచ్చేశాక మేమటుచూడమింక"

"రాజీ! నీకు పెళ్ళా" అంది తను. రాజీ "ఊ" అంది. కానీ రాజీ ముఖంలో ఏదో

దిగులు.

మొన్న పద్మావతి పెళ్ళికి ముఖంలో కనిపించిన కళ రాజీ ముఖంలో లేదు.

వాళ్ళు పెట్టిన మిఠాయి వుండ చేతిలో పట్టుకుని యింటికొచ్చేసి "అమ్మా! రాజీకి పెళ్ళి అయిపోయింది, కూడా తీసుకెళ్ళిపోతున్నారు" అంది తను.

"పెళ్ళీ లేదు - పెటాకులూ లేదు. ఆ పిల్లని అమ్మేశారు."

"ఎందుకు" -

'ఆ... ఏముంది? దానికి చిన్నప్పుడే పెళ్ళయిపోయింది. మొగుడు దేశాలుబట్టి పోయాడు. వీళ్ళు పోషించలేక, దాన్ని కాపాడలేక..." అమ్మ మాటల్లో జాలిగానీ, బాధగానీ లేవు.

"అయితే నన్నూ నువ్వు అమ్మేస్తావా"

సంగీత వీపు విమానం మోత మోగింది. "ముది కబుర్లు మాని, ఫో" అమ్మ విసుక్కుంది.

ఆడపిల్లల్ని అందరూ భారంగా భావిస్తున్నారు. ముఖ్యంగా డబ్బులేని పేదవాళ్ళు. వాళ్ళకి ఆడపిల్లని పోషించడం కష్టమైనా, కాకపోయినా, ఆమెని కొల్లగొట్టేందుకు ఎప్పుడూ కాపుకాసి వుండే మగాళ్ళ నుంచి ఆడపిల్లని కాపాడ్డం వాళ్ళకి కష్టంగా వుంటోంది. అందుకే వదిలించుకుందామని చూస్తున్నారు.

పెళ్ళి అంటే కట్నాలు, కానుకలూ, ఖర్చు. పిల్లని అమ్మేస్తే మనకే కాస్త డబ్బు వస్తుంది. ఈ నిర్ణయంలో 'అమ్మ' ప్రమేయం పెద్దగా వుండదు. ఎందుకంటే ఆమే కదా ఆ యింటికి పెద్ద బానిస.

ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి మళ్ళీ పేపరులోకి చూసింది.

'కాయ్ రాజా కాయ్! పిల్లని సరిగ్గా చూడండి. నిగనిగలాడుతోంది, నిగారింపుగా వుంది. ఇంతవరకూ చెయ్యిపడలేదు - బంగారు బాతు కదయ్యా పిల్లంటే.'

ఇలా ఎన్నో రకాలుగా పిల్లదాని నాణ్యతని కొనియాడుతున్నారా వేలంపాటలో. పిల్లకి అయిదువేల వరుకు పలుకుతుందిట. ఏడాది వాడుకున్నాక మళ్ళీ ఆ పిల్లని పాత యజమానికి అప్పగించాలట - అదొక షరతు. ఆమెకంటూ ఏమీ లేదు. ఎప్పుడు ఎవరి దగ్గరికి తోలితే అక్కడికి తలొంచుకుని వెళ్ళడమే. ఇష్టాలు లేవు. కష్టాలు తెలీవు. కనీసం కన్నీళ్ళు కూడా బయటికి రావడానికి భయపడతాయి.

పల్లెల నుంచి అమాయకమైన ఆడపిల్లల్ని ఏమార్చి, ఆశలు చూపించి బొంబాయి చేర్చి, అక్కడ్నించి గల్ఫ్‌కే పంపిస్తున్నారో - వాళ్ళు గంగ పాలే అవుతున్నారో ఎవరికీ తెలీదు. అన్ని వ్యాపారాల్లోకి చాలా లాభసాటి వ్యాపారమిది.

ఇందులో పెట్టుబడి నీ అవినీతీ, నీ దొంగబుద్ధీ, నీ మోసం, నీ దగా, నీ నిర్దయా, నీ డబ్బాశా - ఇవే - ఇవే పుష్కలంగా వుండాలి. జాగ్రత్తగా చేసుకోగలిగితే బోలెడు

డబ్బు. పిల్లల్ని చేతులు మార్చడంలో చాకచక్యం ప్రదర్శించగలిగితే బడాసాబ్‌ల దృష్టిలో ఎప్పుడూ వుంటావు. లాభాలు పొందవచ్చు. ఎవరికీ కాని, కూటికీ గుడ్డకీ నోచని వాళ్ళ కోసమే నువ్వు చెయ్యాల్సిన వేటంతా.

ఇప్పుడే తెలిసినట్టు అందరూ వులిక్కిపడ్డారు. అవును మరి దేశం నడిబొడ్డున ఇంత కిరాతకమైన వ్యాపారం సాగుతోందని అంగీకరించటానికి ఇబ్బందిగా, కష్టంగా వుంటుంది మరి – అందుకే – వెంటనే కమీషన్లూ, పోలీసులు, రిపోర్టులూ, రిమాండులు అన్నీ రంగప్రవేశం చేశాయి.

ఒక్కసారి చిన్న శబ్దం చేసి ఫ్యాను తిరగడం మొదలుపెట్టింది. పవరొచ్చింది. చల్లగాలి శరీరానికి హాయిగా తగిలింది. వీ.సీ.ఆర్‌లో ఆగిపోయిన సినిమా మళ్ళా అక్కడ్నించే మొదలైంది.

సిపాయి వేషంలో ఉన్న హీరోగారు విసురుగా, విజయగర్వంతో విసిరారు – దీనారాల మూట.

తల వంచుకుని నిలబడిన అమ్మాయి అమ్ముడుపోయింది.